క్లుప్తంగా

కార్యకర్తలకే ప్రాధాన్యం



ఎమ్మెల్యే విరూపాక్షిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఆదే జగనన్న సిద్ధాంతమని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. పార్టీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే గిరి ని నియమించిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరూపాక్షి సోమవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు ఆయనను కలిసి ఆలయ నిర్మాణం గురించి వివరించగా ఆ మొత్తాన్ని వారికి అందజేశారు.

బొలేరో బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామ సమీపంలో సోమవారం ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయిన బొలేరో ట్రాక్టర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో బొలేరోలో ప్రయాణిస్తున్న బీహార్‌కు చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లేఅవుట్ హద్దులపై సర్వే



సర్వే చేస్తున్న మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని రామళ్లకోట రోడ్డులో 2016–17, 2018లో కుడా పరిధిలో పేదలకు కేటాయించిన ఎన్టీఆర్ లేఅవుట్ హద్దులపై మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి సోమవారం సర్వే నిర్వహించారు. 11.52 ఎకరాల ఈ లేఅవుట్‌లో గతంలో 364 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. నాటి నుంచి నిర్మాణాలు సాగకపోవడంతో పాటు ఆక్రమణకు గురైందన్న గ్రీవెన్స్ ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో లేఅవుట్ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సర్వేయర్ తెలిపారు. అయితే పట్టాలన్నీ రద్దు చేసి, జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలకు అవసరమైన 10ఎకరాల స్థలాన్ని సేకరించే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం.

కన్నడ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



అవార్డులు అందుకున్న కన్నడ విద్యార్థులు

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23కు సంబంధించి 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కన్నడ మీడియంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం అవార్డులు అందజేసింది. ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ రామరెడ్డి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్ణాటక ప్రభుత్వం ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ చదవి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు అవార్డులు ఇచ్చి సత్కరించింది. మొదటి బహుమతి కింద టి.శ్రావణికి రూ.12వేలు, రెండో బహుమతి ఏ.అనిత రూ.11వేలు, మూడో బహుమతి పింజరి షిరాజ్‌కు రూ.10వేల నగదుతో పాటు ప్రశంస పత్రాలను అందజేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం తెలిపారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

పత్తికొండ(తుగ్గలి) : ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) సభ్యులైన రైతులందరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని కేడీసీసీ బ్యాంకు పత్తికొండ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సింగం శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూరాలంటే ఈ–కేవైసీ తప్పనిసరి అన్నారు. పత్తికొండ బ్రాంచ్ పరిధిలోని ఆరు సొసైటీలకు నాలుగింటిలో 70 శాతం, మిగిలిన రెండు సహకార సంఘాల్లో 60 శాతం ఈ–కేవైసీ పూర్తయ్యిందని చెప్పారు.

దేవనకొండ: పంటలు నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో 7 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారన్నారు. సుమారుగా 2,500 మంది రైతులు పంట నమోదు చేయించుకున్నారని, ఇప్పటి వరకు 750 మంది రైతులు మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నట్లు చెప్పారు. అలాగే ప్రాథమిక సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న వారు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఆశించిన దిగుబడి రాలేదంటున్న ఈ రైతు పేరు హరిశ్చంద్ర, పెద్దహోతూరు గ్రామం. 'ఆరు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కోత కోయడానికి ఎకరాకు రూ.2,500 ప్రకారం ఖర్చయ్యింది. దిగుబడులు మార్కెట్‌కు తరలించేందుకు మరింత ఖర్చు వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరకు దిగుబడులను విక్రయిస్తే సాగు ఖర్చు కూడా చేతికందేలా లేదు. అయినా మార్కెట్‌లో కంది పప్పు ధర రూ.180 ప్రకారం విక్రయిస్తుండగా మా వద్ద మాత్రం తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటం దారుణం' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.



ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చెబుతున్న ఈ రైతు పేరు తిక్కయ్య, పెద్దహోతూరు. 'నాకున్న 5 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. పంట సాగుకు రూ.75 వేలు ఖర్చు చేశా. పంటకోత కోసం యంత్రానికి రూ.10 వేలకు పైనే అయ్యింది. పంట దిగుబడి 20 క్వింటాళ్లు వచ్చింది. మార్కెట్‌కు తరలించేందుకు మరింత ఖర్చు పెట్టుకోవాలి. పంటను అమ్ముకునేందుకు స్థానికంగా మార్కెట్ లేదు. రాయచూరు, బళ్లారి, కర్నూలో మాత్రమే కొంటారు. అక్కడికి తీసుకెళ్లాలంటే బాగానే ఖర్చవుతుంది. ఇప్పుడున్న ధరకు అమ్ముకుంటే నష్టమే. ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రవాణా ఖర్చులైనా మిగులుతాయి.



పెట్టుబడి రాకపోయె!

ఖరీఫ్‌లో అనావృష్టి, అతి వృష్టి కారణంగా పంటలు తుడిచిపెట్టుకుపోవడంతో రైతులు కందిపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం కోతలు జోరుగా సాగుతున్నాయి. డిసెంబర్ నెలలో నెలకొన్న అననుకూల వాతావరణం దిగుబడులపై తీవ్ర ప్రభావమే చూపింది. ఎకరాకు 6–8 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా.. 3–4 క్వింటాళ్లే వస్తున్నాయి. మరో పక్క మార్కెట్‌లో క్వింటా కందుల ధర రూ.3వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతుండటంతో సాగుకు వెచ్చించిన ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవని రైతులు వాపోతున్నారు.

- ఊపందుకున్న కంది కోతలు
- డిసెంబర్‌లో అననుకూల వాతావరణంతో పడిపోయిన దిగుబడి
- 3–4 క్వింటాళ్ల వరకే పరిమితం
- నియోజకవర్గంలో 15వేల హెక్టార్లలో పంట సాగు
- క్వింటా రూ.3వేల నుంచి రూ.7వేల లోపు పలుకుతున్న ధర
- ఎకరాలో పంట సాగుకు రూ.15వేలకు పైగా ఖర్చు



పెద్దహోతూరు వద్ద కంది పంట కోత కోస్తున్న యంత్రం



ఆలూరు వద్ద కోత యంత్రం ఖర్చు భరించలేక పొలంలో కంది కట్టె కొడుతున్న రైతు



ఆలూరు సమీపంలో ఆరబోసిన కంది దిగుబడులు



పెద్దహోతూరులో గింజలను తూర్పారబడుతు రైతు

ఆలూరు రూరల్: మండలంలో కంది పంట కోతలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన పత్తి పంట అతివృష్టి, అనావృష్టికి పూర్తిగా దెబ్బతినింది. దీంతో 30 శాతం మంది రైతులు ప్రత్యామ్నాయ పంటగా కంది వైపు మొగ్గు చూపారు. పంట సాగుకు ఎకరాకు రూ.15 వేలు వరకు ఖర్చు చేశారు. ఏటా 1,800 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా.. ఈ ఏడాది నియోజకవర్గంలో 15 వేల హెక్టార్లలో కంది పంట సాగు చేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే ఆశించిన స్థాయిలో దిగుబడి, ధర లేకపోయింది. ఎకరాలో కంది పంటను యంత్రాల ద్వారా కోత కోయడానికి రూ.2,500 వరకు వెచ్చిస్తున్నారు. డిసెంబర్ నెలలో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 3 నుంచి 4 క్వింటాళ్ల వస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కంది నాణ్యతను బట్టి ధర క్వింటా రూ.3వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతోంది. కర్నూలు, రాయచూరు, బళ్లారి మార్కెట్‌లలో మాత్రమే కంది కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఆయా మార్కెట్లకు దిగుబడిని తరలించేందుకు బస్తాకు రూ.100కు పైగా రవాణా ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు. కందికి మద్దతు ధర కల్పించి రాష్ట్ర ప్రభుత్వమే ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఇంటర్వ్యూలు వాయిదా

పత్తికొండ(తుగ్గలి) : చౌకదుకాణాల డీలర్ల ఎంపికకు నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. డివిజన్ పరిధిలో 44 చౌకదుకాణలకు నోటిఫికేషన్ జారీ కాగా వాటిలో 31 దుకాణాలకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈనెల 5న పత్తికొండలో రాత పరీక్ష నిర్వహించారు. పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉండగా రెవెన్యూ సదస్సులు, ఇతర కారణాలతో వాయిదా వేసినట్లు ఆర్డీవో ఎస్ భరత్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



అనాథలకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో సోమవారం అనాథ వృద్ధులు, దివ్యాంగులకు ఆదోనికి చెందిన వివేకానంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రవికాంత్, శ్రీధర్‌శెట్టి, గాలెప్ప తదితరులు వారికి బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కర ఇతర సరుకులు అందజేసారు. వీరికి సంస్థ ఆధ్వర్యంలో 36 నెలల నుంచి సరుకులు అందిస్తున్నారు.

ఇసుక తరలింపును అడ్డుకోండి

ఆస్పరి: వెంగళాయిదొడ్డి ఆయకట్టు చెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు సీపీఐ నాయకులు విరుపాక్షి, కృష్ణ, రామాంజిని, రంగప్ప, రంగస్వామి, సోమలింగ, చంద్ర, వీరేశ్ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వెంగళాయిదొడ్డి చెరువు నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి: పట్టణంలోని నారాయణరెడ్డి నగర్‌లో నివాసముంటున్న బుడగ జంగాల రవి (35) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు సోమవారం ఉదయం రవి ఇంటికి అవసరానికి వెళ్లి తలుపు తట్టగా స్పందన లేకపోవడంతో కిటికీలో చూసి ఉరేసుకున్నట్లు గుర్తించారు. భార్య, పిల్లలు డోన్‌లో ఉంటుండగా ఒంటరిగా ఉంటూ, మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ఆలూరు: కేవలం ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో సాగు చేసిన పంటల దిగుబడులతో ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఏ. గోనేహాల్, ఎల్లార్తి ,ముద్దనగేరి గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను గంగాధర్ మల్లయ్య, జనార్ధన్ సోమవారం విక్రయించారు.

జాబితా నుంచి తొలగిస్తే న్యాయ పోరాటం

తుగ్గలి : ఎస్సీ కుల గణన జాబితాలో కురువ కులస్తుల పేర్లను తొలగిస్తే న్యాయ పోరాటం చేస్తామని గొర్రెల సొసైటీ సంఘం జిల్లా డైరెక్టర్ నేరెడుజర్ల చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం సంఘం నాయకులు నాగభూషణం, లక్ష్మన్న, లింగన్న తదితరులతో కలిసి తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు.

వాల్వ్ ఏర్పాటు చేయాల్సిందే

తుగ్గలి : జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీకి హంద్రీ నీవా కాలవ ద్వారా తీసుకెళుతున్న పైప్‌లైన్‌కు జొన్నగిరిలో వాల్వ్ ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జొన్నగిరిలో జెడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, రైతు సంఘం నాయకులు శ్రీరాములు, రంగారెడ్డి, కొండారెడ్డి, నబిరసూల్, వెంకటేశ్వర్లు, సుల్తాన్ తదితరులు వాల్వ్ ఏర్పాటు చేయాలంటూ కంపెనీ ప్రతినిధి రామ్మోహన్‌రెడ్డిని కోరారు. పెద్ద గ్రామమైన జొన్నగిరిలో ఏటా వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశువులకు సైతం గుక్కెడు నీరు దొరక్క అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నుంచి వెళ్లే పైప్‌లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేయాల్సిందేనని పట్టుబట్టారు. సమస్యను కంపెనీ పెద్దల దృష్టికి తీసుకెళతానని రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.



జొన్నగిరిలో జియోమైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

ఆదేశాలిచ్చినా హాజరు కారు!

మద్దికెర : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా క్షేత్రస్థాయి అధికారుల చెవికెక్కడం లేదు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు రాకపోవడంతో సమస్యలు తీరవని ప్రజలు రావడం మానేశారు. స్థానికంగా అర్జీలు ఇస్తే అధికారులు పట్టించుకోవడం లేదని జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయానికి వ్యయప్రయాసలకోర్చి వెళ్లి అర్జీలు అందజేస్తున్నారు. ప్రతి వారం ఉన్నతాధికారులు మొట్టికాయలు వేస్తున్నా.. చీమకుట్టినట్లు కూడా చలనం లేకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, ఉపాధి ఏపీఓ నర్సిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మిగిలిన శాఖల అధికారులు హాజరు కాలేదు.



మద్దికెరలో స్వల్పంగా హాజరైన అధికారులు

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఆస్పరి: విధులకు సక్రమంగా హాజరకు కాని పంచాయతీ కార్యదర్శి కృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కైరుప్పల సచివాలయం వద్ద ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, సురేష్, వీరాంజనేయ, మూర్తి, ఉపేంద్ర ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ బదిలీపై నాలుగు నెలలు క్రితం కైరుప్పలకు వచ్చిన పంచాయతీ కార్యదర్శి సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో కైరుప్పలతో పాటు పుప్పాలదొడ్డి, చెన్నంపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మీటింగులు, ట్రైనింగ్‌లు అంటూ ఎంపీడీఓ కార్యాలయంకే పరిమితమయ్యారని ఆరోపించారు.



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

మద్దికెర : స్థానిక గిడ్డయ్య వీధిలోని ఉట్ల స్తంభాల వద్ద కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బండలు పాతినా అధికారులు పట్టించుకోరా అంటూ కాలనీ వాసులు సాంబశివ, వెంకటేశులు, వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ బండలు పాతడంతో ఆ స్థలం గుండా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోపాల్, ఆదినారాయణ, రామాంజనేయులు ఉన్నారు.



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

మోనూ అమలు చేయాలి

ఆస్పరి: పుటకలమర్రి దగ్గరనున్న మోడల్ స్కూల్‌లో భోజనంలో మెనూ పాటించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా చేయకపోవడంతో విద్యార్థులు కడుపులు మాడ్చుకుంటున్నారని సోమవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు రవి, వినోద్, తరుణ్ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అలాగే.. బాలికల హాస్టల్‌లో కూడా నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

పల్లెల్లో తీవ్ర నీటి ఎద్దడి..



నిట్రవట్టి తోపుడుబండిలో బిందెలు పెట్టుకుని వెళ్తున్న యువకుడు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, సిద్ధాపురం గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. గ్రామాలకు 15 రోజులకొకసారి నీరు వస్తున్నాయని, దీంతో తమకు తాగడానికి గుక్కెడు నీరు దొరకడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎల్లెల్సీ కాలువల్లో నీరు పారుతున్నా..నీటిని సక్రమంగా సరఫరా చేయడంలేదంటున్నారు. దాహార్తిని తీర్చుకునేందుకు వ్యవసాయ బోర్లు, ట్యాంకుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నిట్రవట్టి వద్ద మినీ ట్యాంకుకు ఎక్కించిన బోరు నీటిని పట్టుకుంటున్న ప్రజలు

శోభ మృతికి నివాళి

పత్తికొండ(తుగ్గలి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శోభ(45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు వీరశేఖర్, డివిజన్ మాజీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు దస్తగిరి, యూనియన్ నాయకురాలు కాంతమ్మ సోమవారం పంది కోన గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు అందించారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత

తుగ్గలి : పొలంలో మహిళకు పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైన ఘటన సోమవారం తుగ్గలిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాణి అనే మహిళ పొలంలో కంది కట్టె తొలగిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

కోలుకోలేక వివాహిత మృతి

వెల్దుర్తి: మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ఈనెల 3న పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్ర యత్నించిన గొల్ల జ్యోతిలక్ష్మి (25) కర్నూలు ఆసు పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవా రం మృతి చెందింది. భర్త గొల్ల శంకర్ ప్రసాద్ తాగుడుకు బానిసై తన మాట వినకపోతుండడంతో విసిగి పురుగు మందు తాగినట్లు ఆమె తల్లి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విధులపై అవగాహన పెంచుకోండి

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలల్లో వనరులు సద్వినియోగం చేసుకోవడమే గాకుండా ఉపాధ్యాయుల విధులు నిర్వహణ గురించి తెలుసుకోవాలని ఎంఈఓ రంగస్వామి అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, అలాగే విద్యార్థులు సక్రమంగా బడికి వస్తున్నారో లేదోనని గమనించాలన్నారు. బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



గాయపడిన మల్లమ్మ

హొళగుంద: స్థానిక కోగిలతోట రోడ్డులో సోమవారం బైక్ ఢీకొట్టడంతో మండల కేంద్రానికి చెందిన బోయ మల్లమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. వృద్ధురాలు ఉదయం పొలానికి వెళ్తుండగా కోగిలతోట నుంచి శ్రీకాంత్‌రెడ్డి, మరో ఇద్దరు బైక్ పై వస్తూ ఆమెను ఢీకొట్టడంతో కాళ్లు, చేతులు విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు హొళగుంద పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించారు. హొళగుంద పోలీసులు విచారణ చేస్తున్నారు.

చొప్ప ట్రాక్టర్ బోల్తా..

హొళగుంద : సుకువాయి–విరుపాపురం రోడ్డులో సోమవారం జొన్న చొప్ప ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు, డ్రైవర్ జాగ్రత్త పడటంతో ప్రమాదం తప్పింది. హాలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన రైతులు సుకువాయి బైపాస్ వద్ద ట్రాక్టరులో జొన్న చొప్ప లోడ్ చేసుకొని పొలం నుంచి రోడ్డు ఎక్కించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవరుతో పాటు కూలీలు అప్రమత్తమవడంతో మూగ గాయాలతో బయట పడినట్లు స్థానికులు తెలిపారు.



బోల్తా పడిన జొన్న చొప్ప ట్రాక్టరు

మహిళా ఓటర్లే అధికం

- పత్తికొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2.24లక్షలు
- మహిళా ఓటర్లు 1,12,430
- పురుష ఓటర్లు 1,11,922

పత్తికొండ(తుగ్గలి) : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025కు సంబంధించి తుది ఓటరు జాబితాను డివిజనల్ ఎన్నికల అధికారి ఎస్. భరత్‌నాయక్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గత ఏడాది అక్టోబర్ 29వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించగా అనంతరం ప్రత్యేక ప్రచారాలు నిర్వహించి సోమవారం తుది ఓటర్ల జాబితా ప్రచురించారు. ఈ జాబితా ప్రకారం నియోజకవర్గ పరిధిలోని 257 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,24,374 మంది ఓటర్లు ఉండగా వారిలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 1,12,430 మంది, పురుష ఓటర్లు 1,11,922, థర్డ్ జెండర్ 22 మంది ఉన్నారు. 452 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.

పడిపోతున్నాం.. పట్టించుకోండి!



హొళగుంద ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఒరిగిపోయిన చెట్టు, విద్యుత్ స్తంభం

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న పెద్ద వృక్షం, విద్యుత్ స్తంభం ఒరిగిపోయి అటు తిరిగే వారిని భయపెడుతున్నాయి. గాలి వీసినా, వర్షం వచ్చినా పడిపోయే అవకాశముంది. ఎమ్మార్సీ కార్యాలయం, సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ ఉండటంతో నిత్యం అటువైపు తిరిగే వారితో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అలాగే..ఎమ్మార్సీ, ఎంపీడీఓ కార్యాలయాలకు విద్యుత్, కేబుల్ లైన్‌లు కూడా వెళ్లాయి. గతంలో దాని పక్కనే ఉన్న ఇలాంటి చెట్టు వర్షానికి పడిపోయింది. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.